క్లుప్తంగా

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు

రాజుపాళెం : మండలంలోని గోపాయపల్లెలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సోమవారం నుంచి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామ ప్రజల సహకారంతో దాదాపు రూ.1.25 కోట్లతో ఆలయ పునఃప్రతిష్ట మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో రామేశ్వర స్వామి, పార్వతీ పరమేశ్వరుడు, గణపతి, నాగ దేవతలు, ధ్వజశిఖ, నవగ్రహ, చౌడేశ్వరిదేవి దేవతలు ఇక్కడే కొలువై ఉన్నట్లుగా ఆలయంలో పునఃప్రతిష్ట జరగనుంది. 30న ఉదయం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరుగుతుందని, అనంతరం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తారని తెలిపారు. అక్కడికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని వివరించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



గంగనపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

కాశినాయన : వేసవి కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాశినాయన ఎస్ఐ హనుమంతు శనివారం మైకు ద్వారా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. వేసవి కాలమైనందున ప్రజలు ఆరుబయట నిద్రిస్తుంటారని, పడుకునే ముందు ఇంటి వెనుక తలుపులు జాగ్రత్తగా వేసుకోవాలన్నారు. ఆరుబయట నిద్రించేవారు మెడలో బంగారు వస్తువులు ధరించవద్దు అన్నారు. ఇళ్లు వదిలి బయటికి వెళ్లేటప్పుడు ఇంటిలోని బంగారు వస్తువులు, డబ్బులను బ్యాంకులో ఉంచి వెళ్ళాలన్నారు. కొత్త వ్యక్తులు ఎవరైనా గ్రామాల్లో తిరుగుతుంటే పోలీసులకు 100కు ఫోన్ చేసి తెలపాలన్నారు. వీలైతే ఫొటోలు తీసి పంపించాలని తెలిపారు.

ప్రజలు జాగ్రత్తగా ఉండాలి



దొంగతనాలు జరగకుండా గ్రామాల్లో ఆటో ద్వారా ప్రచారం నిర్వహిస్తున్న పోలీసులు

కలసపాడు : వేసవి కాలంలో గ్రామాల్లో దొంగతనాలు జరగకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కలసపాడు ఎస్ఐ తిమోతి ఆధ్వర్యంలో పోలీసులు శనివారం మండలంలోని ఎగువ రామాపురం, గంగాయపల్లె, బ్రాహ్మణపల్లె, పాత రామాపురం, కలసపాడు గ్రామాల్లో ఆటోలో ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లోని ప్రజలు తమ ఇంట్లో ఉన్న విలువైన బంగారు ఆభరణాలను బ్యాంకుల్లో భద్రపరుచుకోవాలని, గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లోని దేవాలయాల్లోని హుండీలు, విలువైన వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలని కోరారు.

రామేశ్వరరెడ్డికి డాక్టరేట్



రామేశ్వరరెడ్డి

మైదుకూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న పందిర్లపల్లె రామేశ్వర రెడ్డికి కుప్పం ద్రవిడ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. డాక్టర్ బీఆర్ ప్రసాద్ రెడ్డి పర్యవేక్షణలో 'సోషియో ఎకనమిక్, కల్చరల్ డెవలప్‌మెంట్ ఇన్ సౌత్ ఇండియా అండర్ విజయనగర ఎంపైర్' అనే అంశంపై నిర్వహించిన పరిశోధనకు పీహెచ్‌డీ అవార్డు మంజూరు చేసింది. తన గైడ్ ప్రసాద్ రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ డి.వెంకటేశ్వరరెడ్డి, ప్రొద్దుటూరు ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ నంద్యాల కొండారెడ్డి, యోగివేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ సాంబశివారెడ్డిలకు రామేశ్వరరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి, అధ్యాపకులు రామేశ్వరరెడ్డికి అభినందనలు తెలిపారు.

క్రీడాకారులకు అభినందన

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వవిద్యాలయ క్రీడా ప్రాంగణంలో కడప జిల్లా కబడీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్నికైన బీచ్ కబడి పురుషుల ఉమ్మడి కడప జిల్లా జట్టును శనివారం అభినందించారు. ఈ కార్యక్రమంలో డిపార్టుమెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ యోగివేమన యూనివర్సిటీ ప్రెసిడెంట్ గురు శేఖర్, వైస్ ప్రెసిడెంట్ రామ్ నాయక్, పీడీ ట్రెజరర్ కొండయ్య, డీఎస్సీ కబడ్డీ కోచ్ ఆర్ వి శ్రీధర్ పాల్గొన్నారు.

ఏఎఫ్‌యూలో శిల్పకళా దినోత్సవం

కడప ఎడ్యుకేషన్ : అంతర్జాతీయ శిల్పకళా దినోత్సవం సందర్భంగా శనివారం డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ, కల్చరల్ విభాగం విద్యార్థుల కళా ప్రదర్శనను ఘనంగా నిర్వహించింది. విద్యార్థుల శిల్పకళా ప్రతిభను ఉద్ఘాటిస్తూ, కళాకృతుల ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ జి. విశ్వనాథ కుమార్ విద్యార్థుల శిల్ప ప్రదర్శనను అభినందించారు. ఈ ప్రదర్శనకు ఏర్పాట్లు చేసిన శిల్పకల విభాగ అధ్యాపకులను వీసీ అభినందించారు.

ఎమ్మార్పీ ధరలకే ఎరువులను విక్రయించాలి



మాట్లాడుతున్న బద్వేలు ఏడీఏ నాగరాజ

అట్లూరు : ఎరువులు, పురుగు మందుల దుకాణదారులు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ తెలిపారు. శనివారం బద్వేలు వ్యవసాయ డివిజన్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన విత్తన, ఎరువులు, పురుగు మందుల డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రకాల వారీగా ముందస్తుగా అందుబాటులో ఉంచాలని, రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. స్టాక్, ధరల పట్టిక, రిజిస్టర్, బిల్ బుక్స్ నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. స్టాకు నిల్వల నివేదిక ప్రతి 15 రోజులకు ఒకసారి మండల వ్యవసాయాధికారి, సహాయ వ్యవసాయ సంచాలకులు బద్వేలు వారికి కూడా సమర్పించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గడువు ముగిసిన, నిషేధిత పురుగు, కలుపు మందులను ఎట్టి పరిస్థితుల్లో విక్రయించరాదన్నారు. నాణ్యమైన ఉత్పాదకాలను మాత్రమే విక్రయించాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో పది వేల హెక్టార్లలో చిరుధాన్యాలు సాగు లక్ష్యం కాగా బద్వేలు వ్యవసాయ డివిజన్ పరిధిలోని బద్వేలు, సిద్దవటం, అట్లూరు, గోపవరం మండలాల్లో కనీసం 2 వేల హెక్టార్లలో ముఖ్యంగా జొన్న, సజ్జ, రాగి, ఇతర చిరుధాన్యాల సాగును రైతుసేవా కేంద్రాల వారీగా లక్ష్యాలను నిర్దేశించి తదనుగుణంగా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో నాలుగు మండలాల డీలర్లు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన సమ్మేళనాన్ని సద్వినియోగం చేసుకోండి

కాశినాయన : ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన ఉద్యాన సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఉద్యాన అధికారి శ్రీనివాసులరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కడపలోని ఊటుకూరు మాధవి కన్వెన్షన్ హాలులో 29వ తేదీ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సమ్మేళనం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు ఆధునిక సాంకేతికతపై ప్రదర్శన, రైతులు, వ్యాపారస్తులు, ఎగుమతిదారులచే మార్కెటింగ్‌పై అనుసంధానం వంటి వివరాలు తెలియజేస్తారన్నారు. ఉద్యాన రంగంలో నూతన సాంకేతికత, రైతులు ఎదుర్కొంటున్న సవాళ్ళు, వాతావరణ మార్పులు, మార్కెటింగ్ అంశాలపై ప్రధానంగా చర్చిస్తారన్నారు. రైతులు ఈ సమ్మేళనానికి హాజరు కావాలని ఆయన తెలిపారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవు



వాహనదారులకు, వ్యాపారస్తులకు సూచనలిస్తున్న అర్బన్ సీఐ

బద్వేలు అర్బన్ : పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ తోపుడుబండ్లు, ద్విచక్ర వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠినచర్యలు తప్పవని అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ తెలిపారు. శనివారం స్థానిక నెల్లూరు రోడ్డులో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు, చోరీల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని సిద్దవటం రోడ్డు, మైదుకూరు రోడ్డు, నెల్లూరు రోడ్డులలో గల వ్యాపారస్తులు తమ దుకాణాలకు వచ్చే ప్రజలకు నిబంధనలపై అవగాహన కల్పించి వాహనాలు రోడ్లపై ఉంచకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే చోరీల నియంత్రణలో భాగంగా స్వర్ణదుకాణ యజమానులు తప్పనిసరిగా సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పీఎండీఎస్ కిట్ల తయారీ



పీఎండీఎస్ కిట్లతో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు

మైదుకూరు : మండలంలోని ఓబులాపురంలో ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) పద్ధతిలో సాగు చేసే 30 రకాల విత్తనాలతో (పచ్చిరొట్టె, చిరుధాన్యాలు, సుగంధద్రవ్యాలు, ఆకుకూరలు) శనివారం 100 కిట్లను తయారు చేశారు. ఈ కిట్లను ప్రధాన పంటగా సాగు చేసే పొలంలో వెదజల్లాల్సి ఉందని ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది తెలిపారు. దీని వల్ల వేసవిలో భూమి వేడి తాపాన్ని తట్టుకొని ప్రధాన పంటకు కావాల్సిన పోషకాలు అందుతాయని వారు తెలిపారు. అధిక సాంద్రత వల్ల కలుపు నివారణ, భూమి గుల్లబారడం, అకాల వర్షాలకు నేల పైపొర కోల్పోకుండా ఉండటం నీటిని వడిసి పట్టడం జరుగుతుందన్నారు. 25 రోజుల నుంచి ఆకుకూరలు లభ్యం అవుతాయని, 45 రోజుల తర్వాత ప్రధాన పొలంలో కలియదున్నవచ్చని లేదా పశువులకు మేతగా వాడుకోవచ్చని వివరించారు. ఇలా చేయడం వల్ల సేంద్రియ ఎరువు అధిక మొత్తంలో అందడంతోపాటు భూమిలో కర్బనం శాతం కూడా పెరుగుతుందన్నారు. ప్రతి రైతు ప్రధాన పంటకు ముందు ఈ పద్ధతిన పాటించడం వలన ప్రధాన పంటకు ఖర్చు తగ్గించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పప్పనపల్లె సర్పంచ్ వెంకటలక్ష్మి, ఎంటీ కృష్ణారెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి రామనందారెడ్డి, వెంకట రామయ్య పాల్గొన్నారు.

ఉగ్రవాదం నశించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ఉగ్రవాదం నశించాలని ప్రొద్దుటూరు పాత్రికేయులు నినదించారు. శనివారం స్థానిక శ్రీరాములపేటలోని ప్రెస్ క్లబ్ వద్ద వారు కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారు మాట్లాడుతూ అమాయకులైన ప్రజలను ఉగ్రదాడిలో పొట్టన పెట్టుకోవడం చాలా బాధాకరమని, కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని ఖండించారు. ప్రశాంతంగా ఉన్న కశ్మీర్‌లో అల్లకల్లోలం సృష్టించి తద్వారా భారత దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనే దురుద్దేశంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు కల్చరల్ : ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటిస్తున్న మీడియా ప్రతినిధులు

పాలనా సంస్కరణల పేరుతో అన్యాయం

జెడ్పీ ఉద్యోగుల ధర్నా



జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

కడప సెవెన్‌రోడ్స్ : పాలనా సంస్కరణ పేరులతో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 35 వల్ల ఎంపీడీఓ పదోన్నతుల్లో అడ్మినిస్ట్రేటివ్ అధికారులకు అన్యాయం జరుగుతోందని ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లంకా మల్లేశ్వర్‌రెడ్డి, సి.శ్రీనివాసులు రెడ్డి అన్నారు. ఇందుకు నిరసనగా శనివారం జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఫీడర్ క్యాటగిరిని బట్టి ఎంపీడీఓ పదోన్నతులో తమకు 34 శాతం కేటాయించే వారని పేర్కొన్నారు. అలాగే ఈఓ పీఆర్అండ్ఆర్‌డీలకు 33 శాతం, డైరెక్ట్ నియామకాల కింద 30 శాతం, ఇతరులకు మూడు శాతం అవకాశం ఉండేదన్నారు. సంస్కరణ పేరుతో ప్రస్తుతం ఎంపీడీఓల డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటాను రద్దు చేశారన్నారు. ప్రభుత్వం వెంటనే జీఓ. నెం. 35ను సవరించి పదోన్నతి కోటాను 50 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ పరిపాలన అధికారులు విజయభాస్కర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, మధుసూదన్, ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: నిరుద్యోగులు ఐక్యంగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక పోరాటాలు చేసి సాధించుకున్న మెగా డీఎస్సీ నోటిఫికేషన్ లో అనేక లోపాలు ఉన్నాయని, వాటిని తక్షణమే కూటమి ప్రభుత్వం పరిష్కరించి అభ్యర్థులకు న్యాయం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివ కుమార్ తెలిపారు. శనివారం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసిలను డీఎస్సీకి అనర్హులు చేసే నిబంధనలు తొలగించాలని డిమాండ్ చేశారు. ఇంటర్, డిగ్రీ, పీజీలో 45 శాతం, 50 శాతం మార్కులు ఉండాలి అనే నిబంధనను తొలగించి అందరికీ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో సైతం 40 శాతానికి అనుమతి ఇచ్చారని గుర్తు చేశారు. సిలబస్ విస్తృతి రీత్యా అభ్యర్థులకు ప్రిపరేషన్ కు 90 రోజులు సమయం ఇవ్వాలన్నారు. దాదాపు 55 పుస్తకాలు రివిజన్ చేసుకోడానికి కూడా ప్రభుత్వం ఇచ్చిన సమయం సరిపోవడం లేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీకి అప్లై చేసుకోడానికి ఇచ్చిన వెబ్ సైట్స్, టోల్ ఫ్రీ నెంబర్లు ఏమీ పని చేయడం లేదన్నారు. అనేక మందికి ఎడిట్ ఆప్షన్, సబ్జెక్టు చూపించడం లేదని అన్నారు. తక్షణమే సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించి అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశం లో డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

నేడు ఐఐటీ ప్రతిభా పరీక్ష

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సూపర్ బజార్ రోడ్డులోని భావన జూనియర్ కాలేజీలో ఆదివారం ఉదయం 10 గంటలకు శశాంక్ ఐఐటీ అకాడమీ ఆధ్వర్యంలో ఐఐటీ ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నట్లు డైరెక్టర్ శశాంక్ ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో ఐఐటీ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 90529 02589 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు వార్షికోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శివాలయం వెనుక ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు శ్రీచౌడేశ్వరి ఆర్ట్స్ అసోసియేషన్ దశమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ వ్యవస్థాపకుడు కంభం పాములేటి ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా తొగటవీరక్షత్రియ కుల గురువు శ్రీదివ్యజ్ఞానానంద గిరి స్వామి హాజరవుతారన్నారు. శ్రీచౌడేశ్వరి వైభవం పద్య నాటకం 30 మంది కళాకారులతో నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. కళాకారులు, కళాభిమానులు ఈ వేడుకలో పాల్గొనాలని కోరారు.

28 నుంచి సమ్మర్ క్యాంప్

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలోని పుట్టపర్తి నారాయణాచార్యుల ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో ఈనెల 28 నుండి జూన్ 6వ తేదీ వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి తిరుపతమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. రోజు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు క్యాంప్ నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు. బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్, స్టోరీ లిజనింగ్, బుక్ రివ్యూ, స్పోకెన్ ఇంగ్లీష్, మ్యాథమ్యాటిక్స్, క్యారమ్స్, జిరాఫీ చెస్ తదితర అంశాలను విద్యార్థులకు నేర్పిస్తామని వివరించారు. విద్యార్థులు ఈ సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బ్రహ్మంగారిమఠం ఇన్‌చార్జి ఎంపీడీఓగా చాపాడు ఎంపీడీఓ

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంగారిమఠం మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా చాపాడు మండల అభివృద్ధి అధికారి వీర కిషోర్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా పరిషత్ సీఈఓ ఓబుళమ్మ ఉత్తర్వులు జారీ చేశారు. బ్రహ్మంగారిమఠం ఎంపీడీఓగా పని చేస్తున్న వెంగమునిరెడ్డి దీర్ఘకాలిక సెలవులో వెళ్లడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జి ఎఫ్ఏసీగా చాపాడు ఎంపీడీఓ వీర కిషోర్‌ను నియమించారు.

రేపు మండల సమావేశం

గోపవరం : మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. ఎంపీపీ ధనలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీతో పాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని కోరారు. ఈ సమావేశానికి సభ్యులు మాత్రమే రావాలని, బినామీలు వస్తే అనుమతించబడదని తెలిపారు. మూడు నెలలుగా జరిగిన అభివృద్ధి, చేపట్టబోయే పనుల వివరాలతో ఆయా శాఖల అధికారులు పూర్తిస్థాయి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలన్నారు. అధికారులు ఎవరూ కూడా గైర్హాజరు కావద్దని కోరారు.

గౌరీదేవివి తప్పుడు ఆరోపణలు

జమ్మలమడుగు : పెద్దముడియం మండలం కొండ పాపాయపల్లికు చెందిన పి.గౌరిదేవి దిగువ కల్వటాల గ్రామంలో వారసత్వంగా వచ్చిన 40 ఎకరాల భమిని ఇతరుల పేరుతో రికార్డుల్లో ఎక్కించామని తప్పుడు అరోపణలు చేయడం జరుగుతుందని డిప్యూటీ తహసీల్దార్ గౌసియాబేగం, ఆర్ఐ భువనేశ్వరిలు తెలిపారు.

టీడీ, ఆర్ఐలపై చర్యలు తీసుకోవాలంటూ పత్రికల్లో రావడం జరిగింది. తాము తప్పుడు పనులు చేయలేదన్నారు. పెద్దముడియం మండలం పాపాయపల్లి గ్రామానికి చెందిన పి.గౌరిదేవి కల్వటాల గ్రామంలో సర్వే నంబర్ 691/1,691/3,722 సర్వేనంబర్‌లలో ఎటువంటి సాగు భూమిలేదు. ప్రస్తుతం వెబ్‌ల్యాండ్ పోస్టర్‌లో 2017 ఆగస్టు 1వ తేదీ వరకు కైప పెద్ద నాగిరెడ్డి పేరిట నమోదై ఉందన్నారు. ప్రస్తుతం సర్వే నంబర్ 691/1,691/3,722 నంబర్‌లలో ఎలాంటి మార్పులు జరుగలేదన్నారు. కేవలం 691/5పి1లో నమోదైన భూమి కైప పెద్దనాగిరెడ్డి మరణించడంతో ఆయన భార్య కైప పుణ్యవతమ్మ పేరిట పోతీ కేసు ద్వారా మాత్రమే భూమిని మార్పు చేయబడిందన్నారు. అయితే గౌరిదేవికి ఎటువంటి పత్రాలు గాని, అనుభవంలోగాని లేరు. తమ పేరిట లేని భూమి వారిపేరు మీద రాయాలని పలు సార్లు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ భూమి కుటుంబ సభ్యుల తగదాలో ఉండటంతో తాము ఆమె పెట్టుకున్న దరఖాస్తులను తిరస్కరించడం జరిగిందని టీటీ, గౌసియా, ఆర్ఐ భువనేశ్వరిలు వెల్లడించారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో వెలసిన శ్రీస్వయంభు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనిత్రయోదశి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు స్వామివారి తాంబూలం అందించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పూజారి పెంచలయ్యస్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వైశాఖమాసం ఆరంభంతో లక్ష్మీనరసింహస్వామి దీక్ష, మహా పాదయాత్ర ఉంటుందని, స్వామివారి దీక్ష తీసుకోవాల్సిన భక్తులు మే 3వ తేదీ నుండి మొదలవుతుందని, 41 రోజులు స్వామివారి దీక్షలో ఉండి స్వామివారి పాదయాత్ర ఉంటుందని, మొట్టమొదటిసారిగా నియోజకవర్గంలో ఎప్పుడూ లేని విధంగా స్వామివారి మహా పాదయాత్ర ఉంటుందని తెలిపారు. ఈ యాత్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుండి శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా నరసింహస్వామి (పెంచలకోన) ఆలయం వరకు కొనసాగుతుందని తెలిపారు. స్వామివారి దీక్ష, పాదయాత్రలో పాల్గొనదలచిన వారు ఆలయ పూజారిని సంప్రదించాలని కోరారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

విద్యుత్ కార్యాలయం తనిఖీ



సిబ్బంది సూచనలిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ రమణ

అట్లూరు : స్థానిక విద్యుత్ కార్యాలయాన్ని శనివారం జిల్లా విద్యుత్ శాఖ అధికారి సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం అట్లూరు అసిస్టెంట్ ఇంజనీర్ విజయకుమార్, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం విద్యుత్ వినియోగదారులకు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, విద్యుత్ అంతరాయాలకు గల కారణాలను పరిశీలించి ముందస్తు మరమ్మతులు చేసుకుని నాణ్యమైన నిరంతర విద్యుత్‌ను అందించాలని సూచించారు. సంవత్సరంలో ఏప్రిల్, మే నెలల్లో పని రెట్టింపుగా ఉంటుందని, ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాల వలన కలిగే గాలులు, ఎండలు, మెరుపుల ప్రభావం విద్యుత్ వ్యవస్థపై అధికంగా పడుతుందని, తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ నాటికి వ్యవసాయ సర్వీసులు విడుదల చేయుటకు కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. కార్యాలయ ప్రాంగణంలోని ట్రాన్స్‌పార్మర్లు కార్యరూపం దాల్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, కార్యాలయాల చుట్టూ సంస్కృతులను వీడాలని హెచ్చరించారు. విధులలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

అట్లూరు : ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురాం కృష్ణంరాజు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస రావుపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.చాంద్‌బాషా, మండల కార్యదర్శి ఇ.రమణయ్యలు తెలిపారు. శనివారం అట్లూరు క్రాస్ రోడ్డులోని సీపీఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ నిరుపేదల ఇళ్ళు కూల్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నానని ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు అనుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. నిరుపేదలు కేవలం రెండు సెంట్లు స్థలాన్ని ఆక్రమించి ఇళ్ళను నిర్మించుకుంటుంటే అదేదో మహా పాపం అన్నట్లు వాటిని కూలదోస్తున్నారని, కానీ బడాబాబులు ఎకరాలలో స్థలాలను ఆక్రమించుకున్నా పట్టించుకోవట్లేదన్నారు. పాలకోడేరులో భూస్వాముల ఆధీనంలో ఉన్న భూములను వదిలేసి నిరుపేదల ఇళ్ళను కూల్చడం దుర్మార్గమన్నారు. వెంటనే శ్రీనివాసరావుకు రఘురామ కృష్ణంరాజు క్షమాపణలు చెప్పి ఆయన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు



సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఆ పార్టీ నాయకులు

బద్వేలు అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా పోరాటాలకు సిద్ధమవుతామని సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి బందెలఓబయ్య, జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్.చంద్రశేఖర్‌లు తెలిపారు. సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక నెల్లూరు రోడ్డులో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుకు, కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు చంద్రమోహన్‌రాజు, విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు అనిల్, పార్టీ నియోజకవర్గ నాయకుడు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

వన్య ప్రాణుల సంరక్షణలో పశు వైద్యుల పాత్ర కీలకం



కుక్కకు సూది వేస్తున్న జిల్లా పారెస్టు అధికారి వినీత్‌కుమార్

కడప అగ్రికల్చర్: వన్య ప్రాణుల సంరక్షణలో పశు వైద్యుల పాత్ర ఎంతో కీలకం అని జిల్లా అటవీశాఖ అధికారి వినీత్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ శారదమ్మ ఆధ్వర్యంలో కడపలోని వీపీసీలో పశు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నంది విగ్రహానికి పూలమాలలు వేసి అభివందనాలు చేశారు. అనంతరం పశు ఆరోగ్యం.. ప్రజల ఆరోగ్యం అన్న విషయంపై పశు వైద్యులందరూ సమన్వయంతో పని చేసి పశు సంపద సురక్షితంకు కృషి చేయాలన్నారు. పశువులతో అనుబంధం ప్రజల్లో ఎక్కువగా ఉందని, మారుతున్న కాలానుగుణంగా పశు వైద్యులు పాత్ర, వారి సేవ చాలా గొప్పగా ఉండాలన్నారు. అనంతరం సీనియర్ పశువైద్యులైన డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ లావణ్యలక్ష్మిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల, కడప వీపీసీ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య, రంగస్వామి, ఏడీఏలు రాజశేఖర్, వెంకటసుబ్బయ్య, శ్రీధర్‌లింగారెడ్డి, శివరామిరెడ్డి, మారుతిప్రతాప్, అనుపమ, స్వాతి, మాధవి, లీలాస్వర్ణ, ప్రమోద్, ఈశ్వర్‌ప్రసాద్, శివశంకర్, నేతాజీ, సుబ్బరాయుడు, జేవీఓ రాజశేఖర్, కిషోర్, సరిత, నశ్రీన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుపై అక్రమ కేసు అన్యాయం



డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్సీ, బాధితురాలు

జమ్మలమడుగు : పెద్దముడియం మండలానికి చెందిన రైతు మధుసూదన్‌రెడ్డిపై సోలార్ కంపెనీ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుబ్బారావు దొంగతనం కేసు నమోదు చేయడం అన్యాయమని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శనివారం డీఎస్పీ వెంకటేశ్వర్లును బాధితుడి కుటుంబంతో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ కంపెనీకి చెందిన యాజమాన్య ప్రతినిధులు ప్రభుత్వ భూములతోపాటు, పట్టా భూములలో కూడా రైతులకు తెలియకుండా పనులు చేపట్టారన్నారు. దీనిని ప్రశ్నించిన రైతుపై తప్పుడు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం దారుణమన్నారు. దీనిపై విచారణ చేపట్టి బాధిత రైతుకు న్యాయం చేయాలని కోరారు.

సోలార్ కంపెనీపై బాధిత రైతు సుజాత ఫిర్యాదు

సోలార్ కంపెనీ ప్రతినిధులు యంత్రాలు తీసుకుని వచ్చి పట్టా భూముల్లో తమకు తెలియకుండా పనులు చేస్తుండటంతో అడ్డుకున్నందుకు తమపై దాడికి పాల్పడినట్లు బాధితురాలు అక్కంరెడ్డి సుజాత డీఎస్పీ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. తాను, తన కూతురు అడ్డుకుంటే తమపై దాడి చేయడంతోపాటు తమ కుమార్తె కాలి పట్టీలను లాగేసుకున్నారని బాధితురాలు డీఎస్పీ ముందు వాపోయింది. పోలీసులు సోలార్ కంపెనీ ప్రతినిధులపై కేసు నమోదు చేయకపోతే ఎస్పీకి ఫిర్యాదు చేస్తామన్నారు.

మానవత్వం చాటుకున్న సచివాలయ సిబ్బంది

జమ్మలమడుగు : మరణించిన అనాథశవానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు కన్నెలూరు సచివాలయ సిబ్బంది. శనివారం కన్నెలూరు గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న చావిడిలో ఉంటున్న ఆమల్ల వెంకటరెడ్డి గత కొంత కాలంగా అనారోగ్యంతో శనివారం మరణించారు. అనాథ మృతదేహాని అంత్యక్రియలను నిర్వహించటానికి గ్రామంలోని పెద్దలైన మునీధర్‌రెడ్డి, కొండారెడ్డి, రెవెన్యూ సచివాలయ సిబ్బంది కలిసి హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు.